క్లుప్తంగా

17 నుంచి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు



ఉత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం రూరల్: పోతుకుంట గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలను ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతు ఏటా తొలి ఏకాదశిని పురస్కరించుకొని గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 17న సాయంత్రం 5 గంటలకు స్వామి వారిని గుట్ట వద్దకు తీసుకుపోతామన్నారు. అక్కడ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు గంగపూజ చేసిన అనంతరం పల్లకిలో స్వామి వారిని ఊరేగిస్తామన్నారు. 18న నాగదేవతలకు పూజలు, దానంగాలు, భజన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడతామన్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: ఖిద్మత్- ఎ-ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అనాథకు అంత్యక్రియలు నిర్వహించి ఆత్మబంధువులుగా నిలిచారు. వివరాలు.. కొన్నేళ్ల క్రితం సౌతాఫ్రికా నుంచి వచ్చిన ఒలైవర్(85) సత్యసాయి భక్తుడిగా గోకులంలో స్థిరపడ్డాడు. శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. వారికి సొంత వారు ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఖిద్మత్ ఎఖల్క్ సొసైటీ సభ్యులను ఆశ్రయించారు. కమిటీ సభ్యులు షామీర్, అలీ, చాంద్ సాకీర్, సాదిక్ అన్నీతామై పట్టణంలోని కర్ణాటకనాగేపల్లి శ్మశానవాటికలో వారి సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణ పెద్దలు, ప్రజలు సొసైటీ సభ్యులను అభినందించారు.

విత్తనశుద్ధితో తెగుళ్లు దూరం



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

అమడగూరు: విత్తన శుద్ధి చేయడం ద్వారా నేల నుంచి సంక్రమించే వివిధ రకాల తెగుళ్లు దూరమవుతాయని డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మహమ్మదాబాద్ రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించిన ఆయన పంటలకు సోకే వివిధ రకాల రోగాలు, తెగుళ్లు, వాటి నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రధాన పంటలైన వేరుశనగ, సజ్జ, కంది, మొక్కజొన్న పంటలకు సోకే తెగుళ్లపై రైతులకు తెలియజేశారు. విత్తన శుద్ధి, పురుగులతో వచ్చే రోగాలు, సస్యరక్షణ, నీటి యాజమాన్యం గురించి వివరించారు. పంటలకు నానో యూరియా, డీఏపీ వాడకం ద్వారా కలిగే ఉపయోగాలు తెలియజేశారు. డ్రోన్ ద్వారా పంటలకు పిచికారీ చేయడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమణాచారి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ క్రిష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

నేడు నల్లమాడ వారపు సంత వేలం

నల్లమాడ: నల్లమాడ వారపుసంత వేలం పాట శనివారం ఉదయం 11 గంటలకు పంచాయితీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయితీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

విద్యుత్ స్తంభం సరిచేయండి



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కొత్తచెరువు: ఓబుళదేవరపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు షణ్ముకానందరెడ్డి పొలంలో 20 రోజుల క్రితం గాలీవానకు విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని అధికారులు చూట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని రైతు వాపోయాడు. వేరుశనగ విత్తనం విత్తుకునేందుకు సమయం ఆసన్నమైందని, ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని రైతు కోరుతున్నాడు.

బాల్య వివాహాలను అరికడదాం



బాలల హక్కుల చట్టాలపై పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

కదిరి అర్బన్: అందరి సహకారంతో కదిరి రెవెన్యూ డివిజన్‌ను బాల్య వివాహాల రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుదామని ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ పీడీ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలలపై లైంగికదాడుల నిరోధక చట్టాలపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఎస్‌ఐలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓతో పాటు డీఎస్పీ శ్రీలత మాట్లాడారు. బాల్యవివాహాలు అరికట్టడం అందరి బాధ్యత అన్నారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే 1098 సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామస్థాయిలో బాల్యవివాహాల మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 15 రోజులకోసారి బాల్య వివాహాలు, బాలల చట్టాలపై లైన్ డిపార్ట్‌మెంట్లు పని చేసేలా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం నిర్వహించి విద్యార్థులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. అనంతరం బాలల హక్కుల చట్టాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో కదిరి డివిజన్ పరిధిలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది'పై ర్యాలీ



మలమీదపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గందోడివారిపల్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మలమీదపల్లి, కోటూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు 'అంగన్‌వాడీ పిలుస్తోంది' అనే కార్యక్రమంపై శుక్రవారం మలమీదపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, సుకన్య పాల్గొన్నారు.

తనకల్లు: కోటపల్లి, చీకటిమానిపల్లి, గందోడివారిపల్లి, ముత్యాలవారిపల్లి గ్రామాలలో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులతో కలిసి ర్యాలీ చేశారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సమాయానికి మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు అందజేసి వారిని శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండేటట్లు చేస్తామన్నారు. ఆహ్లాదకర వాతావణంలో ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామని పేర్కొన్నారు.

సిగరెట్ పొగ.. జీవితానికి సెగ

- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో వక్తలు



రెడ్డిపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

నల్లమాడ: సిగరెట్ పొగ జీవితానికి సెగ అని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పొగాకు వద్దు-జీవితమే ముద్దు, పొగ తాగొద్దు-క్యాన్సర్‌కు గురికావొద్దు అనే నినాదాలు చేశారు. అనంతరం వైఎస్సార్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన మానవహారంలో పలువురు మాట్లాడుతూ పొగాకు వాడటం వలన క్యాన్సర్, టీబీ, గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు అలవాటు మానుకోవడం కోసం ప్రతి జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అక్కడ కౌన్సిలింగ్ తీసుకొని అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. నేను నా జీవితంలో ఎప్పటికీ పొగాకు పదార్థాలు వాడనని, పొగాకు ఉత్పత్తుల వినియోగం నుంచి తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తానని ర్యాలీలో పాల్గొన్నవారితో ప్రతిజ్ఞ చేయించారు. డీసీఎం డాక్టర్ త్రిలోక్‌నాథ్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, సీహెచ్‌ఓ రామాంజులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అవగాహన



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్

ధర్మవరం రూరల్: రావులచెరువు గ్రామంలో డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో బీసీజీ టీకాపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాను 60 సంవత్సరాలు దాటిన, పొగాకు, సిగరెట్లు తాగే, బరువు తక్కువ ఉన్న, చక్కెర వ్యాధిగ్రస్తులు, టీబీ వ్యాధి గతంలో వచ్చి నయం అయిన వారికి వేస్తామన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది బ్రహ్మనందరెడ్డి, రేణుక, పరిమళ, ప్రవీణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు సావిత్రమ్మ, సరస్వతి, నాగేంద్రమ్మ, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్ తొలగించాలని దౌర్జన్యం

- టీడీపీ, జనసేన కార్యకర్తలపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రామాంజులునాయక్, సరోజమ్మ

గాండ్లపెంట: కల్లుబావితండాలో ఇంటికి తీసుకున్న కుళాయి కనెక్షన్ తొలగించాలని టీడీపీ, జనసేన కార్యకర్తలు తనపై దౌర్జన్యానికి దిగారని గ్రామానికి చెందిన ఎం.రామాంజులునాయక్, సరోజమ్మ వాపోయారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 6 నెలల క్రితం ఆర్డీటీ వారు ఇల్లు నిర్మించి ఇవ్వడంతో ఇంటికి పంచాయతీ కుళాయి కనెక్షన్ తీసుకున్నామన్నారు. అయితే తమ ప్రభుత్వంలో మీరు నీటి కుళాయి తీసుకోకూడదంటూ ప్రతి రోజు ఆదే గ్రామానికి చెందిన రవీంద్రనాయక్, లక్ష్మేనాయక్, రామచంద్రనాయక్, నాగభూషణనాయక్, హరినాయక్ తదితరులు దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. తన ఇంటి కుళాయి పైపులైన్ రెండు ఇంచుల పైపుతో తీసుకున్నారని వారు ఎంపీడీఓ, కార్యదర్శికి తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదుపై ఎంపీడీఓ రామానాయక్, కార్యదర్శి రవికుమార్ గురువారం గ్రామానికి వచ్చి పూడ్చిన పైపులైన్‌ను పరిశీలించి ఒక ఇంచు పైపుతోనే కుళాయి కనెక్షన్ తీసుకున్నట్లు గుర్తించారన్నారు. అయినా పంచాయతీ కుళాయిని తొలగించాలని తమకు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. అధికారులు తనకు న్యాయం చేయాలని రామాంజులునాయక్, సరోజమ్మ కోరారు.

ప్రశాంతంగా జీవించండి



గందోడిపల్లి గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ దిలీప్ కుమార్

తలుపుల : సార్వత్రిక ఎన్నికలు ముగిశాయని, గ్రామాల్లో గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ప్రజలకు సూచించారు. ఏపులపల్లిలో శుక్రవారం ఆయన హెడ్‌కానిస్టేబుల్ గుర్రప్ప, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో గ్రామంలో గొడవ పడ్డారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని, ఎవరినీ ఉపేక్షించమని హెచ్చరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

బుక్కపట్నం: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం తరుగువాండ్లపల్లి, చెంద్రాయునిపల్లిలో పర్యటించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికలు ముగిశాయని, ప్రజలు పార్టీలు మరిచి కలిసిమెలిసి జీవించాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి: 'కదిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేయాలనేది నా కోరిక, ఈసారి పాలనలో నా మార్క్ ఏంటో చూపిస్తా' అని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. కదిరి నుంచి ఎస్‌పీ కుంట వరకూ రాయచోటి రోడ్ అధ్వానంగా ఉందని, కొన్నేళ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు తాను కళ్లారా చూశానన్నారు. కేవలం 3 నెలల్లో ఆ రోడ్డు రూపురేఖలు మార్చేస్తానని చెప్పారు. సదరు కాంట్రాక్టర్ కూడా నష్టపోకుండా ఆయనకు పూర్తి స్థాయిలో బిల్లులు అందేలా చూడటంతో పాటు మళ్లీ రీ టెండర్ పిలిచి ఈ ఏడాది సెప్టెంబర్ 30లోగా ఆ రోడ్డును పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తానని చెప్పారు. ఇటీవల జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి కేజీబీవీల్లో సీట్లు పెంచాలని కోరానని, అందుకు కలెక్టర్ సైతం సానుకూలంగా స్పందించారని తెలిపారు. కదిరి నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో సీట్ల పెంపునకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. కదిరి మున్సిపల్ పరిధిలో 743 ఇళ్ల నిర్మాణాలకు కొందరు డబ్బు తీసుకొని బోగస్ ఇంటి ప్లాన్‌లు ఇచ్చారని, వాటన్నింటిపై విచారణ జరిపించి రెవెన్యూ రికవరీ(ఆర్‌ఆర్)యాక్ట్ ప్రకారం తిన్న సొమ్ము కక్కిస్తానని చెప్పారు. దీనిపై పక్కా ఆధారాలతో అవినీతికి పాల్పడిన వారి పేర్లను త్వరలోనే మీడియా ముందు ప్రజలకు వివరిస్తానన్నారు. బాధితులు ఎవరికైతే డబ్బులిచ్చారో వారిని ప్రశ్నించి తమ డబ్బు వాపసు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తమది ప్రజా ప్రభుత్వమని నిరూపిస్తామని తెలిపారు. టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ చరణ్ అన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో పరిటాల చారిటబుల్ ట్రస్టు యుగంధర్ అధ్యక్షతన రక్తదానం శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదానం చేసే సామాజిక సేవా సంస్థలు, రక్తదాతలకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది వినోదిని, అంజి, అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, చైతన్య గంగిరెడ్డి, వారధి చారిటబుల్ నిర్వాహకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీ

కనగానపల్లి: మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి షిర్డి సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. స్థానిక ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న సాయిబాబా ఆలయంలోకి రాత్రి వేళలో దుండగలు చొరబడ్డారు. తలుపులు పగలగొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. హుండీని గ్రామ శివారులోకి ఎత్తుకెళ్లి తాళం పగలగొట్టి అందులోని వేల నగదు చోరీ చేశారు. ఈ ఘటనపై గ్రామస్తులు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ తారక రామారావు

నల్లచెరువు: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని వక్తలు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఆదర్శ రైతు సంఘం సభ్యులకు జనజీవన వాసన్ సంస్థ ద్వారా మండల కేంద్రంలోని హరినాథ్ వేరుశనగ మిల్లులో శుక్రవారం వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే 49 మంది రైతులకు జనజీవన్ వాసన్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఆర్ పరివర్తన్ ఆర్థిక సహకారంతో బ్యాంక్ మేనేజర్ తారక రామారావు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు సబ్సిడీ ద్వారా అందజేసిన వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ వ్యవసాయ అధికారి నారాయణ, మండల వ్యవసాయ అధికారిణి భారతి, ఉద్యానవన శాఖ అధికారిణి లావణ్య, ఏపీఎం రవీంద్ర, వాసన్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల అందజేత

అమడగూరు: మండలంలోని అన్ని రకాల ప్రభుత్వ బడులకు శుక్రవారం ఎంఈఓలు జిలాన్‌బాషా, సంపూర్ణ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలను అందజేశారు. 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలతో పాటుగా 2 ప్రాథమికోన్నత, 39 ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు సరిపడే అన్ని సబ్జెక్టుల పుస్తకాలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా 12,163 పుస్తకాలు, 10,244 నోట్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. అలాగే యూనిఫాం, షూలు రాగానే పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉప్పర, సగర విద్యార్థులకు రేపు ప్రతిభా పురస్కారాలు

హిందూపురం టౌన్: 10వ తరగతి, ఇంటర్, నీట్‌లో ప్రతిభ కనబరిచిన జిల్లాలోని ఉప్పర, సగర విద్యార్థులకు ఈ నెల 16న పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈమేరకు భగీరథ ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు ఆదినారాయణప్ప, జనరల్ సెక్రటరీ వెంకటేశులు, ఉపాధ్యక్షుడు కిష్టప్ప, ట్రెజరర్ రామాంజి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావాలని వారు కోరారు.

ఈ-కేవైసీ కోసం అవస్థలు



ఈకేవైసీ కోసం బారులు తీరిన జనం

పుట్టపర్తి రూరల్: వంట గ్యాస్ వినియోగదారులు ఈ- కేవైసీ చేయించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. పుట్టపర్తిలోని ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద శుక్రవారం వందలాది మంది బారులు దీరారు. రెండు రోజులుగా తెల్లవారుజామున 4 గంటలకే క్యూలైన్లలో నిల్చుంటున్నట్లు సమాచారం. రోజుకు 100 టోకెన్లు ఇస్తుండటంతో పనులు మానుకొని ఇక్కడికి వచ్చిన ఎక్కువ మంది వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ- కేవైసీ చేయించుకోకుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ అందదేమోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల ప్రజలు పుట్టపర్తికి రావాలంటే ఇబ్బందిగా ఉందని తమ మండలాల్లో ఈ-కేవైసీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇంకా గడువు ఉందని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రాజీవ్ దేవ్ చెప్పారు.

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గౌరీ శంకర్ జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగేంద్ర శుక్రవారం తెలిపారు. దివ్యాంగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన ట్రెక్కింగ్, జోమరింగ్, రప్లింగ్ క్రీడల్లో గౌరీ శంకర్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. త్వరలో లడక్‌లో నిర్వహించే జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈసందర్భంగా పీడీ వన్నూరప్ప, విజయరామారావు, పీఈటీ రమేష్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



పెద్దిపల్లిలో చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మహిళలకు వారికి సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య సూచించారు. పెద్దిపల్లిలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహాల మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు హక్కుల రక్షణ కల్పించిన ప్రత్యేక చట్టాల గురించి తెలుసుకున్నప్పుడే తమ పట్ల సమాజం చూపుతున్న వివక్షను గ్రహించి, ఎదుర్కోగలిగితే ధైర్యం వస్తుందన్నారు. మహిళలకు న్యాయ సలహాల మండలి ఉచిత న్యాయ సాయం అందిస్తుందని చెప్పారు. స్త్రీల హక్కులు, దిశ, చట్టాలు, బాల్య వివాహాలు, లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షణ చట్టం(పోక్సో), గృహహింస, వేధింపుల, తదితర చట్టాలను వివరించారు. మహిళలకు న్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళా చట్టాలపై మహిళలకు నాటిక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తాడిమర్రిలో తొట్టెలోని నీటిని పారబోయిస్తున్న దృశ్యం



హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ కల్పనరెడ్డి

తాడిమర్రి: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది ప్రజలను హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు పెద్దకోట్ల, నార్సింపల్లి, కునుకుంట్ల, ఎం.అగ్రహారం, పిన్నదరి, దాడితోట, చిల్లవారిపల్లి, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వీధుల్లో పర్యటిస్తూ మురుగునీటి గుంతలు, బురదమయంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. చిప్పలు, టైర్లు, కుండలు, తొట్టెల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని పారబోయించారు. అనంతరం వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వర్షాల కారణంతో నీటినిల్వతో దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. తద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గన్యా తదితర జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఏఎన్‌ఎంలు కోమలి, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ కల్పనారెడ్డి సూచించారు. దామవాండ్లపల్లిలో వైద్యాధికారులు శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 60 మంది రోగులకు ఇంటి వద్దే వైద్య సేవలను అందజేశారు. దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలున్న రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం యర్రగుంటపల్లిలోని హెల్త్ సెంటర్‌ను డాక్టర్ కల్పనరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఏఎన్‌ఎం భాగ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బత్తలపల్లి: డి.చెర్లోపల్లి సమీపంలోని వ్యవసాయతోట వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4,450లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వీరిని ధర్మవరం కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.